నేడు సీఐటీయూ సమావేశం

కీసర: బండ్లగూడ ప్రజయ్ సాయి గార్డెన్స్ కమ్యూనిటీ హాల్లో సీఐటీయూ మండల సమన్వయ కమిటీ విస్తృతస్థాయి మొదటి సమావేశం ఈనెల 19న (నేడు) నిర్వహించనున్నట్లు సీఐటీయూ జిల్లా కమిటీ నాయకుడు బంగారు నర్సింగ్‌రావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని మున్సిపల్ వర్కర్స్, అంగన్‌వాడీ, ఆశా వర్కర్స్, ట్రాన్స్‌పోర్ట్, భవన నిర్మాణ, అసంఘటితరంగ కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని ఆయన కోరారు.

దుండగులను శిక్షించాలి

ఘట్‌కేసర్: దేవాలయాలు ధ్వంసం చేసిన వారిని కఠినంగా శిక్షించాలని శ్రీ చక్రపీఠం పీఠాధిపతి శ్రియానంద నాథ డిమాండ్ చేశారు. ఘట్‌కేసర్‌లో శనివారం ఆయన మాట్లాడుతూ.. రాంపల్లి రామాలయంలోని ఆంజనేయ స్వామి విగ్రహాన్ని ధ్వంసం చేయడం హిందు భక్తుల మనోభావాలు దెబ్బ తీయడమేనన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే


మాట్లాడుతున్న చైర్మన్ రత్తయ్య

ఘట్‌కేసర్: కొండాపూర్ విజ్ఞాన్ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం గ్రాడ్యుయేషన్ డే వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా జేఎన్టీయూ రిజిస్ట్రార్ వెంకటేశ్వర్‌రావు, గౌరవ అతిథిగా డాక్టర్ సతీశ్‌రెడ్డి, కళాశాల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులు చిన్న చిన్న ఉద్యోగాలకు పరిమితం కాకుండా జీవితంలో ఉన్నత శిఖరాలు చేరుకుని పలువురికి ఉపాధి కల్పించాలన్నారు. అనంతరం పట్టాలు అందజేసి ప్రతిభ చూపిన విద్యార్థులకు నగదు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో సీఈఓ బోయపాటి శ్రావణ్, ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పారావు నాయుడు పాల్గొన్నారు.

అమృత్ 2.0కు నారాయణ చెరువు ఎంపిక

మేడ్చల్‌రూరల్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అమృత్ 2.0కు గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని నారాయణ చెరువు ఎంపికైంది. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ వెంకటగోపాల్, పబ్లిక్ హెల్త్, ఇంజినీరింగ్ విభాగం అధికారులు ఎస్ఈ వెంకటేశ్వర్లు, ఈఈ ప్రభాకర్‌రెడ్డి శనివారం చెరువును సందర్శించి చెరువు అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. వారి వెంట డిప్యూటీ ఈఈ దుర్గప్రసాద్, మేనేజర్ శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

దుండగులను కఠినంగా శిక్షించాలి


ర్యాలీ తీస్తున్న బీజేపీ, బజరంగ్‌దళ్ నాయకులు, స్థానికులు

కీసర: రాంపల్లిలో హనుమాన్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను గుర్తించి కఠిన చర్యలను తీసుకోవాలని డిమాండ్ చేస్తూ శనివారం బీజేపీ, బీజేవైఎం, బజరంగ్‌దళ్, స్థానికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిని నటీ కరాటే కల్యాణి, రాంపల్లి మాజీ సర్పంచ్ మునిగంటి జ్యోతి మాట్లాడుతూ.. దుండగులను పట్టుకునే వరకు పోరాటం చేస్తామన్నారు.

సామూహిక సీమంతాలు


వెంకటాపురంలో గర్భిణులకు సీమంతం చేస్తున్న దృశ్యం

అల్వాల్: పోషణమాసం సందర్భంగా అల్వాల్ ప్రాజెక్ట్ సెక్టార్ అంగన్‌వాడీ టీచర్లు శనివారం వెంకటాపురంలోని ఇంద్రానగర్ కమ్యూనిటీహాల్‌లో గర్భిణులకు సామూహిక సీమంతాలు, ఆరునెలలు నిండిన పిల్లలకు అన్నప్రాసన నిర్వహించారు. సీడీపీవో స్వాతి, సూపర్‌వైజర్ సుధకీర్తిలు హాజరై పలు సూచనలు చేశారు.

శ్రమదానం

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి 25వ డివిజన్ సాయిహిల్స్ కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం శ్రమదానం నిర్వహించారు.మాజీ కార్పొరేటర్ హరిశంకర్‌రెడ్డి హాజరై కాలనీవాసులతో కలిసి పాల్గొని కాలనీలోని రోడ్డుకు ఇరువైపుల ఉన్న గడ్డి, పిచ్చి మొక్కలను తొలగించారు. కాలనీ అధ్యక్ష, కార్యదర్శులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

సవాల్‌గా భూముల పరిరక్షణ!

- ఇంటి దొంగలతో ఇక్కట్ల పాలవుతున్న అధికార యంత్రాంగం
- పటిష్ట వ్యవస్థ లేకపోవడంతో యథేచ్ఛగా భూఆక్రమణలు
- కబ్జాల కట్టడికి అధికారుల పకడ్బందీ చర్యలు

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో అన్యాక్రాంతమవుతున్న ప్రభుత్వ, అసైన్డ్ భూములు


కబ్జాదారుల కబంధ హస్తాల్లో ..

సాక్షి,మేడ్చల్ జిల్లా: మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ప్రభుత్వ, అసైన్డ్ భూముల పరిరక్షణ అధికార యంత్రాంగానికి సవాల్‌గా మారుతోంది. ధన, అధికార బలమున్న పెద్దలకు కొందరు ఉద్యోగులు తలొగ్గుతుండగా, మరికొందరు అమ్యామ్యాలకు లాలూచి పడి.. భూమార్పిడిలోని లోసుగులను అనుకూలంగా మల్చుకుని తప్పుడు చర్యలకు ఒడిగడుతున్నారు. ప్రభుత్వ భూములను రక్షించాల్సిన కొందరు రాజకీయ పెద్దలు వాటిని భక్షించేందుకు పన్నుతున్న కుట్రల్లో పలువురు అధికారులు, ఉద్యోగులు పావులవుతున్నారు. దీంతో భూపరిరక్షణ పెద్ద టాస్క్‌గా తయారైంది. క్షేత్రస్థాయిలో ప్రభుత్వ, అసైన్డ్ భూములకు రక్షణగా నిలిచి.. వాటి ఆక్రమణలపై ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు చేరవేసే పటిష్ట వ్యవస్థ లేకపోవడం కూడా భూ పరిరక్షణ రెవెన్యూ శాఖకు ఇబ్బందికరంగా మారింది. డివిజన్ స్థాయిల్లో గతంలో లాగా భూపరిరక్షణకు టాస్క్‌ఫోర్స్ టీంలు లేకపోవడంతో కూడా సులవుతోంది. ఈ క్లిష్ట తరుణంలో ప్రభుత్వ భూముల పరిరక్షణ ధ్యేయంగా సర్వే నిర్వహించిన రెవెన్యూ యంత్రాంగం సాంకేతికంగా కిహోల్ మార్కస్ లాంగ్వేజ్ (కేఎంఎల్) మ్యాప్ (గూగుల్)లో పొందుపర్చడం ద్వారా పటిష్ట చర్యలకు పూనుకుంటోంది.

మండలాల వారీగా భూముల గుర్తింపు

జిల్లాలోని 15 మండలాల పరిధిలో గతంలో గుర్తించిన ప్రభుత్వ, అసైన్డ్ భూముల వివరాలను మరోసారి పరిశీలించి, వాటి పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని రెవెన్యూ యంత్రాంగం భావిస్తోంది. భూముల సంరక్షణ బాధ్యత ఆర్ఐ, డీటీ, తహసీల్దార్లపైనే ఉందని పేర్కొంటున్న జిల్లా యంత్రాంగం.. గుర్తించిన ప్రభుత్వ భూముల పరిరక్షణకు ప్రహరీలు, ఫెన్సింగ్ వంటి పనులు చేపట్టడంపై దృష్టి సారిస్తోంది.

జిల్లాలోని 11 మండలాల పరిధిలో దాదాపు 269 సర్వే నంబర్లలో 5,195 ఎకరాల ప్రభుత్వ భూములు ఉన్నట్లు గుర్తించిన రెవెన్యూ శాఖ ఇందులో ఎన్ని భూములు కబ్జాకు గురయ్యాయి.. ఎంత సంరక్షణలో ఉందన్న సమాచారాన్ని మాత్రం చెప్పలేకపోతోంది. రెవెన్యూ రికార్డుల ప్రకారం.. బాలానగర్ మండలంలో 700 ఎకరాల ప్రభుత్వ భూమి ఉన్నట్లు తెలుస్తోంది. శామీర్‌పేటలో 420, దుండిగల్ గండిమైసమ్మలో 425, మేడిపలిలో 900, ఘట్కేసర్‌లో 500, కాప్రాలో 400, కీసరలో 417, కుత్బుల్లాపూర్‌లో 600, బాచుపల్లిలో 360, ఉప్పల్‌లో 333.13, మల్కాజిగిరిలో 113.06, మేడ్చల్ మండలాల్లో 37 ఎకరాల ప్రభుత్వ భూములు ఉన్నట్లు రికార్డులు చెబుతున్నాయి.

అసైన్డ్ భూములెక్కువనే..

జిల్లాలో 2004 సంవత్సరానికి ముందు 116 రెవెన్యూ గ్రామాలు, పలు ప్రాంతాలు, బస్తీల పరిధిలో 8,230 మంది పేదలైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ, మైనార్టీలకు 11,384 ఎకరాల ప్రభుత్వ భూములను పంటల సాగు, ఇళ్ల స్థలాల కోసం పంపిణీ చేశారు. ఘటేస్కర్ మండలంలోని 17 గ్రామాల్లో 1610 ఎకరాలు, శామీర్‌పేటలో 30 గ్రామాల్లో 1451, కీసరలోని 16 గ్రామాల్లో 1500, మేడ్చల్‌లోని 29 గ్రామాల్లో 4400 ఎకరాలు, ఉప్పల్‌లోని 6 రెవెన్యూ గ్రామాల్లో 286, కుత్బుల్లాపూర్‌లోని 18 గ్రామాల్లో 855 ఎకరాల అసైన్డ్ భూములను అప్పటి ప్రభుత్వం నిర్ణయంలో భాగంగా రెవెన్యూ యంత్రాంగం పంపిణీ చేసింది. ఇందులో చాలావరకు వెంచర్లు, రియల్ ఎస్టేట్ వెంచర్లు, అపార్టుమెంట్లు, ఇండిపెండెంట్ ఇండ్లు, ప్రైవేట్ విద్యా సంస్థలు, ఆసుపత్రులుగా మారినట్లు తెలుస్తోంది.

కోర్టుల్లో కేసులు..

జిల్లాలో భూసంబంధిత కోర్టు కేసులు 706 ఉన్నాయి. ఇందులో మల్కాజిగిరి రెవెన్యూ డివిజన్ పరిధిలో 349, కీసర డివిజన్‌లో 357 ఉన్నట్లు తెలుస్తోంది. అలాగే వివిధ కోర్టుల్లోని కేసుల వివరాలు సుప్రీంకోర్టులో 1, హైకోర్టులో 481, జిల్లా కోర్టులో 65, లోకాయుక్త కోర్టులో 57, ఎల్‌డీ కోర్టులో 63, సివిల్ కోర్టులో 6 కేసులు కొనసాగుతున్నాయి. కోర్టు ధిక్కారంలో కూడా పలు కేసులు ఉన్నట్లు తెలుస్తోంది.

వివాదంలోని భూములివే..

మేడ్చల్ జిల్లాలో భూవివాదాలు అధికంగా ఉన్నాయి. రెవెన్యూ శాఖ రికార్డుల ప్రకారం వివాదాస్పద భూములు 12,073.17 ఎకరాలు ఉన్నాయి. ఇందులో సివిల్ కోర్టు పరిధిలో భూములు 2,485 ఎకరాలు కాగా, రెవెన్యూ కోర్టు పరిధిలో 904 ఎకరాలు ఉన్నాయి. ఇతర వివాదాలతోపాటు ఎండోమెంట్, వక్ఫ్, అటవీ, వ్యక్తిగత వివాదాల పరిధిలో 2,466 ఎకరాలు, అసైన్డ్ భూముల కేటాయింపుల్లో భాగంగా 1603 ఎకరాల భూములు కూడా వివాదాల్లో ఉన్నాయి.

స్పందించారు.. జరిమానా విధించారు

సాక్షి ఎఫెక్ట్..


దుకాణదారుడికి జరిమానా విధిస్తున్న కమిషనర్ చంద్రప్రకాశ్

మేడ్చల్‌రూరల్: 'విన్నవించుకున్నా.. వినరా' అనే శీర్షికన ఈనెల 14న 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన కథనానికి మేడ్చల్ మున్సిపల్ అధికారులు స్పందించారు. మున్సిపల్ పరిధిలోని పూడూరుతో పాటు పలు ప్రదేశాల్లో రోడ్డు పక్కనే చెత్త వేస్తున్న ఓ హార్డ్‌వేర్ దుకాణదారుడికి రూ. 20 వేలు జరిమానా విధించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మున్సిపల్ శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ రాంచందర్, పూడురు గ్రామ జవాన్ మహేందర్, ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ జ్ఞానేశ్వర్‌రెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

మార్కెట్లకు దీపావళి శోభ

మార్కెట్లలో దీపావళి సందడి నెలకొన్నది. ప్రజలు పూజా సామగ్రి, ప్రమిదలు, దొంతులు, పూలు, పండ్లు కొనుగోలు చేస్తుండడంతో మేడ్చల్ పట్టణంలోని మార్కెట్లు, పలు ప్రధాన కూడళ్లు కిటకిటలాడుతున్నాయి. మరోవైపు పండుగ సందర్భంగా ఎలక్ట్రానిక్ పరికరాల వ్యాపారులు, షాపింగ్ మాల్స్ వారు కస్టమర్లకు భారీ డిస్కౌంట్లు ఇస్తూ ఆకర్షిస్తున్నాయి.

–మేడ్చల్‌రూరల్


మేడ్చల్ మార్కెట్‌లో అమ్మకానికి సిద్ధంగా మట్టి ప్రమిదలు


లక్ష్మీదేవి, ఇతర దేవతామూర్తుల ప్రతిమలు


ప్రమిదలు కొనుగోలు చేస్తున్న మహిళలు

పారిశుద్ధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ


దుస్తులు అందజేస్తున్న కంది శ్రీరాములు

సుభాష్‌నగర్: నిత్యం తమ చెమటను చిందించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుద్ధ కార్మికుల శ్రమ వెలకట్టలేనిదని బీజేపీ మేడ్చల్ జిల్లా కౌన్సిల్ మెంబర్ కంది శ్రీరాములు అన్నారు. దీపావళి పండుగ సందర్భంగా సుభాష్ నగర్ డివిజన్ సూరారం కాలనీలో పనిచేస్తున్న 30 మంది పారిశుద్ధ్య కార్మికులకు, వాటర్ వర్క్ సిబ్బందికి చీరలు, దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎండనక వాననక ప్రతిరోజు కాలనీలను, బస్తీలను శుభ్రంగా ఉంచుతున్న పారిశుద్ధ కార్మికుల పట్ల ప్రతి ఒక్కరూ గౌరవంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు లక్ష్మీపతి రాజు, పులి బలరాం, భీమ్రాజ్, విట్టల్ తదితరులు పాల్గొన్నారు.

హైమాస్ట్ లైట్లు ప్రారంభం



రంగారెడ్డినగర్: శ్మశాన వాటికలో మౌలిక సదుపాయాలను మెరుగు పర్చాలని గాంధీనగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు రాఘవులు అన్నారు. శనివారం గాంధీనగర్ హిందూ శ్మశాన వాటికలో నూతనంగా ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను ప్రారంభించారు. సదుపాయాలు లేక దహన సంస్కారాలకు వచ్చే జనం ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారులు ఈ విషయమై దృష్టి సారించాలని కోరారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి మేకల ఎల్లయ్య, వాజీద్, లక్ష్మీనాథ్, బిక్షపతి, శ్రీనివాస్, ప్రకాష్, తిమ్మయ్య, నవీన్, సందీప్, అజయ్, ఆనంద్, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన


పరీక్షలు చేయించుకుంటున్న రామేశ్వర్‌రెడ్డి

కుత్బుల్లాపూర్: స్వచ్ఛంద సంస్థలు నిర్వహిస్తున్న వైద్య సేవలు పేద, మధ్య తరగతి ప్రజలకు వరమని ట్రస్మా రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు రామేశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం కుత్బుల్లాపూర్ సర్కిల్ బాపునగర్‌లోని ఆర్.ఎస్.కే ఉన్నత పాఠశాలలో లయన్స్ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ నార్త్ ఆధ్వర్యంలో మల్లారెడ్డి ఆసుపత్రి సౌజన్యంతో ప్రారంభించారు. శిబిరంలో 700 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ నార్త్ అధ్యక్షుడు బిర్రు అంజనేయులు, ట్రపసా గ్రేటర్ కుత్బుల్లాపూర్ అధ్యక్షుడు వినోద్ జాదవ్, ఎస్.ఆర్. భాషా, వైష్ణవి గ్రూప్ ఆఫ్ చైర్మన్ చెప్యాల నర్సింహులు గౌడ్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దున్నపోతు దాడిలో రైతు మృతి



ఘట్‌కేసర్: మున్సిపాలిటీలోని అంకుషాపూర్ గ్రామానికి చెందిన పులిగిల్ల జంగయ్యయాదవ్ (68) దున్నపోతు దాడిలో శనివారం మృతి చెందాడు. జంగయ్య యాదవ్ రోజు మాదిరిగానే పశువులను మేతకు తీసుకెళ్లాడు. సాయంత్రం కాగానే పశువులను ఇంటికి తీసుకెళ్తుండగ అంకుషాపూర్ విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో అందులోని ఓ దున్నపోతు దాడి చేయగా తీవ్రగాయాలై అక్కడికక్కడే మరణించాడు. పెంచిన దున్నపోతే ప్రాణాలు తీయడంతో కుటుంబీకులు కన్నీరు మున్నీరయ్యారు.


నాగారంలో రాస్తారోకో చేస్తున్న అఖిల పక్ష నేతలు


ఆర్టీసీ బస్ డిపో ఎదుట బంద్‌లో ఉద్యోగులు


శామీర్‌పేటలో రాజీవ్‌రహదారిపై బైఠాయించిన అఖిలపక్ష నాయకులు

రాష్ట్ర బంద్ విజయవంతం

- మూసేసిన వ్యాపార, వాణిజ్య సముదాయాలు
- డిపోలకే పరిమితమైన ఆర్టీసీ బస్సులు


రాస్తారోకో చేస్తున్న బీసీ విద్యార్థి సంఘం, సీపీఎం నాయకులు

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీసీ సంఘాల జేఏసీ శనివారం నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర బంద్ విజయవంతమైంది. విద్యా సంస్థలు, వ్యాపార, వాణిజ్య సముదాయాలను స్వచ్ఛందంగా మూసేశారు. బంద్‌కు కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్, అంబేద్కర్ సంఘాల వారు మద్దతు తెలపడంతో పాటు, బీసీ సంఘాలతో కలిసి ర్యాలీలు చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. బీసీలకు రిజర్వేషన్లు అమలయ్యేవరకు పోరాటం కొనసాగిస్తూనే ఉంటామన్నారు. ఆయా చోట్ల పార్టీలు, సంఘాల నాయకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

–మేడ్చల్ జోన్ బృందం


కాంగ్రెస్ నాయకుల ప్రదర్శన


డిపోకే పరిమితమైన బస్సులు


కీసరలో రాస్తారోకో చేస్తున్న అఖిల పక్ష నేతలు


అన్నోజిగూడలో దుకాణాలను మూసి వేయిస్తున్న నాయకులు


మూడుచింతలపల్లి మున్సిపాలిటీ కేంద్రంలో..


జవహర్‌నగర్‌లో బీసీ జేఏసీ ఆధ్వర్యంలో ..


ఘట్‌కేసర్‌లో నిరసన తెలుపుతున్న నాయకులు